సాక్షి సంగారెడ్డి

శుక్రవారం ; 22 ; మార్చి ; 2024



పరిశ్రమలొచ్చె..ఉపాధి తెచ్చె

పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో ఉపాధి ఉరకలేస్తోంది.

వివరాలు 8లో ▶



మహిళ దారుణ హత్య

మహిళను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈసంఘటన టేక్మాల్ మండలంలో గురువారం చోటు చేసుకుంది.

వివరాలు 8లో ▶

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం (సాయంత్రం) 06:33

సహర్ : శనివారం (ఉదయం) 04:56

న్యూస్‌రీల్

కస్టడీకి ఎమ్మెల్యే సోదరుడు

పటాన్‌చెరుటౌన్: అక్రమ మైనింగ్ కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని ఈ నెల 15న పటాన్‌చెరు పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనను కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులపాటు రిమాండ్ విధించింది. అయితే గురువారం పటాన్‌చెరు పోలీసులు మూడు రోజులకు కస్టడీ పిటిషన్ వేసి మధుసూదన్ రెడ్డిని విచారిస్తున్నారు. ఈ విచారణ ఎక్కడ చేస్తున్నారన్న విషయం తెలియ రాలేదు.

కేతకిలో డీఈఓ పూజలు



కేతకి ఆలయంలో డీఈఓ వెంకటేశ్వర్లు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయాన్ని గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఝరాసంగంలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

హుండీ ఆదాయం రూ.3.32లక్షలు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని బడంపేట గ్రామ శివారులో వెలిసిన రాచన్న స్వామి వార్షిక జాతర హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో కానుకలను లెక్కించగా రూ.3,32,296 ఆదాయం వచ్చింది. హుండీలో లభించిన బంగారు, వెండి ఆభరణాలను తిరిగి అందులో వేసి సీల్ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప, ఆలయ పాలక మండలి సభ్యులు దయానంద్ పాటిల్, చంద్రప్ప, గోపాల్, బస్వరాజ్, సిరిపాల్, నాగేష్, అంజయ్య, అశోక్, మహేష్ స్వామి పాల్గొన్నారు.

తపాల శాఖలో విస్తృత సేవలు



మాట్లాడుతున్న హెడ్ క్వార్టర్స్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ టీఎం శ్రీలత

సంగారెడ్డి టౌన్ : తపాల శాఖలో అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ టీఎం శ్రీలత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి మెగా మేళా అవార్డు గ్రహీతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తపాలా ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. తపాల శాఖ సేవలను గ్రామీణులకు వివరించాలని సూచించారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో తపాలా జీవిత బీమా ప్రీమియం, వివిధ స్కీములలో కొత్త అకౌంట్ల సేకరణలో ప్రతిభ కనబరిచిన వారికి మెమొంటోలు అందించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్వీ మురళి కుమార్, ఏఎస్పీ స్వాగతిక, ఏఎస్ పిత్రిపాఠి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు రఘువీర్, సావిత్రి, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ రాంజీ, మెయిల్ ఓవర్ సీర్స్ శ్రీనివాస్, శంకర్, ఉమాకాంత్, యూనుస్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

• రుణపడి ఉంటా..



జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సత్కరించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క పాల్గొన్నారు.

– జహీరాబాద్



జనుము పూత.. మనసు పులకింత

ప్రకృతి అందాలు మనసుకెంతో ఆహ్లాదాన్ని పంచుతాయి. ముఖ్యంగా పల్లెల్లో పంట పొలాలను చూస్తే ముచ్చటేస్తుంది. ఝరాసంగం నుంచి బొప్పన్‌పల్లి వెళ్లే రహదారి పక్కన ఉన్న ఈ జనుము పంట చూపరులను ఆకట్టుకుంటుంది. విరగబూసిన పసుపు పచ్చని పూత అటువైపుగా వెళ్లే ప్రయణికులు పరవశించేలా చేస్తుంది.

– ఝరాసంగం(జహీరాబాద్):

హరిత రక్షణ

భానుడు భగ్గుమంటున్నాడు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ హరితహారం మొక్కలను సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పదో విడత హరితహారం కోసం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండకు వాడిపోకుండా షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుతో ఎండ తీవ్రతకు మొక్కలు వాడిపోకుండా ఉంటాయి. – రాయికోడ్(అందోల్)

- ఎండల తీవ్రతకు మొక్కల సంరక్షణకు చర్యలు
- నర్సరీల్లో షేడ్‌నెట్‌ల ఏర్పాటు
- పదవ విడత హరితహారానికి రూ.21 కోట్లు
- జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



రాయికోడ్ మండలం పీపడ్‌పల్లిలోని నర్సరీలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్



ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతీ నర్సరీలో 6 వేల చొప్పున మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాదికి సంబంధించిన 3 వేల మొక్కలు ఉండగా.. వాటి సంరక్షణతో పాటు మరో 3 వేల మొక్కలను కొత్తగా పెంచుతున్నారు. రానున్న హరితహారానికి జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండటంతో మొక్కలు వాడి పోకుండా నిత్యం నీళ్లు అందిస్తున్నారు. నర్సరీలపై షేడ్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం గ్రామ పంచాయతీలోని గ్రీన్ ఫండ్ ద్వారా ఒక్కో నర్సరీకి రూ.2,500 వెచ్చించి షేడ్ నెట్‌లను కొనుగోలు చేసి మొక్కల ఎండ తగలకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే నాటిన విత్తనాల్లో 30 శాతం ఎండల తీవ్రతతో మొలకెత్తలేదు. దీంతో లక్ష్యానికి అనుగుణంగా ఆయా నర్సరీల్లో విత్తనాలకు బదులు నారు నాటించి పెంచుతున్నారు.

షేడ్‌నెట్‌లతో మొక్కలకు రక్షణ

షేడ్‌నెట్ ఏర్పాటుతో మొక్కలపై సగం ఎండ పడకుండా ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 616 నర్సరీల్లో షేడ్‌నెట్‌ల ఏర్పాటు పూర్తయింది. త్వరలో మిగిలిన వాటిల్లో ఏర్పాటు చేస్తాం. జూన్, జూలై నెలల్లో జిల్లా వ్యాప్తంగా 30 లక్షల మొక్కలను నాటించేందుకు నిర్ణయించాం. మొక్కల సంరక్షణపై నిర్వాహకులకు తగిన సూచనలు ఇచ్చాం.

– మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

రూ.21 కోట్ల ఖర్చు

పదో విడత హరితహారంకు ప్రభుత్వం రూ.21 కోట్ల వెచ్చిస్తుంది. ఈజీఎస్ ద్వారా జిల్లాలోని 639 గ్రామ పంచాయతీల్లో ఒక్కో నర్సరీని ఏర్పాటు చేశారు. నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం కోసం సుమారు రూ.9 కోట్ల నిధులను వెచ్చించినట్లు అధికారులు తెలిపారు. పదవ విడత హరితహారంలో భాగంగా 38 లక్షల మొక్కలను పెంచి 30 లక్షలను నాటించడం లక్ష్యంగా నిర్ణయించారు. నర్సరీల నుంచి మొక్కలను తరలించడం, గుంతలు తీసి మొక్కలు నాటించడం కోసం రూ.12 కోట్ల వరకు నిధులు ఖర్చు కానున్నాయి. అధికారులు నిత్యం నర్సరీలను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి సలహాలు సూచనలు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడికి చెక్



- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్నిరకాల చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిలాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణాలు, గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 08455 276155 నంబర్‌కు ఫోన్ చేస్తే వీలైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కరిస్తారని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా చలివేంద్రాలు, బస్టాప్‌లలో సన్ షెడ్, టీన్ షెడ్ వంటివి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మూగజీవాలకు తాగునీటి తొట్లు ఏర్పాటు చేయాలన్నారు. అడవులలో చెట్లను నరికి నిప్పు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ కూలీలకు, రైతులకు టెంటు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఓ సాయిబాబా, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని అరికట్టాలి



సామూహిక శ్రీమంతాలు నిర్వహిస్తున్న అధికారి లలిత కుమారి

జోగిపేట(అందోల్): స్త్రీలు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి అన్నారు. జోగిపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ గంజ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రేష్టమైన ఆహారం అందించి చిన్నారులు, బాలింతల్లో రక్తహీనతకు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మిల్లెట్‌ల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు.చైల్డ్ మ్యారేజీలు, చైల్డ్ లేబర్‌కు సంబంధించి హెల్ప్‌లైన్‌ను వాడుకోవాలని, ఈ విషయమై అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం టీచర్లు తయారు చేసి తీసుకువచ్చిన ఆహార పదార్థాలను ప్రదర్శనకు ఉంచారు. సఖి సీఓ కల్పన, తాలెల్మ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్ఓ శాంతి, సీడీపీఓ ప్రియాంక, సూపర్ వైజర్స్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

కోహీర్(జహీరాబాద్): సమతుల ఆహారం తీసుకోవడం వల్ల తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సునితాబాయి సూచించారు. పట్టణంలోని లాలాకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ పక్వాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రోజూ తీసుకునే ఆహారంలో పప్పు దినుసులు, చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. సూపర్ వైజర్లు తులసి, అనిత, అంజమ్మ, పవన్, టీచర్లు పద్మమ్మ, శైలజ, సుందరమ్మ, గిరిజ, వనజ, శాంతి పాల్గొన్నారు.

ఖేడ్‌కు చేరుకున్న రథయాత్ర



పట్టణానికి చేరుకున్న దత్తగిరి మహారాజ్ రథయాత్ర

నారాయణఖేడ్: దత్తగిరి మహారాజ్ 45వ వార్షిక అమరతిథిని పురస్కరించుకొని మనూరు మండలం బెల్లాపూర్ నుంచి ప్రారంభించిన పల్లకీసేవ, రథయాత్ర, పాదయాత్ర గురువారం సాయంత్రం నారాయణఖేడ్ కు చేరుకుంది. దత్తగిరి మహారాజ్ జన్మస్థలమైన బెల్లాపూర్ నుంచి ప్రతీ సంవత్సరం వార్షిక అమరతిథి సందర్భంగా ఈ కార్యక్రమం చేపడతారు. ఇందులో భాగంగానే బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు అవదూతగిరి మహారాజ్, సిద్దేశ్వర్ మహారాజ్‌ల ఆధ్వర్యంలో గురువారం రాత్రి నారాయణఖేడ్ దత్తగిరి ఆశ్రమానికి చేరుకుంది. దత్తగిరి ఆశ్రమ ట్రస్ట్ బాధ్యులు కాశీనాథ్ పటేల్, శివలింగ్ పటేల్, ముత్యం హన్మండ్లు, కిష్టయ్య మాస్టార్ తదితరులు ఖేడ్‌లో పల్లకీ సేవ, రథయాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమం లో భజనలు, కీర్తనలు నిర్వహించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే

మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

హవేళిఘణాపూర్(మెదక్): కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చీకటి ఒప్పందాలు చేసుకుంటూ కింది స్థాయి నాయకులను బలి చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలోని 17 స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఏ సర్వేలు చూసినా బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తాయని చెబుతున్నాయన్నారు. దీనిని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చీకటి ఒప్పందాలతో ముందుకెళ్తున్నాయని మండిపడ్డారు. మెదక్‌లో నన్ను ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్

స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్
- ఘనంగా ఐఐటీహెచ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కేంద్ర ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహిస్తుందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు సహకారం అందిస్తుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్‌కరందికర్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఐఐటీ 16వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అభయ్ 'సాతి'లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష రంగంతో పాటు, వైద్య రంగంలో దేశం ఎన్నో విజయాలను సాధించిందని అన్నారు. కంప్యూటరింగ్, కమ్యూనికేషన్స్, క్వాంటం సెన్సింగ్, మెట్రాలజీ, క్వాంటం మెటీరియల్స్–డివైజ్ తదితర వాటిల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు తమశాఖ ద్వారా బీజాలు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ పాలకమండల చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి మోదీ పెద్దపీట

బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

జహీరాబాద్: మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి ఇతర పార్టీల నాయకులు భారీగా బీజేపీలో చేరుతున్నారని లోక్‌సభ జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఇతర పార్టీ నాయకులు కాషాయం కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రధాని పెద్దపీట వేస్తున్నారన్నారు. 370 ఆర్టికల్ రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం మోదీతోనే సాధ్యమైందన్నారు. బీజేపీ 400 ఎంపీ స్థానాల్లో గెలవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు విద్యాసంస్థల సంఘం నాయకుడు క్రిష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, దేశెట్టి పాటిల్, అరుణ్‌కుమార్, సత్యం ముదిరాజ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో ఆయా పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, నాయకులు కె.జనార్దన్‌రెడ్డి, అనంత్‌రావు కుల్‌కర్ణి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, అరుణ కౌశస్, అర్చన సారదా, శ్రీనివాస్‌గుప్తా, విశ్వనాథ్‌స్వామి పాల్గొన్నారు.

జహీరాబాద్‌ను అభివృద్ధి చేస్తా

బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడిగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో కలిసి ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేసిన విధంగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ కు బహుమతిగా అందించాలన్నారు. అనంతరం కేతకీ సంగమేశ్వర ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, వెంకటేశం, శంకరయ్య, నర్సింలు, నరేష్ కుమార్, పరమేశ్వర్ పాటిల్, బస్వరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



15మందికి తీవ్ర గాయాలు

సదాశివపేట (సంగారెడ్డి): పట్టణంలోని రహమత్, ఫయాజ్‌నగర్ కాలనీలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కల స్వైర విహారం చేస్తుండటంతో పిల్లలు, పెద్దలు బెంబేలెత్తుతున్నారు. ఒంటరిగా వీధిలో నడవాలంటేనే జంకుతున్నారు. గురువారం ఉదయం దాదాపు 15 మంది కుక్క కాటుకు గాయపడ్డారు. వారందరూ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



సదాశివపేట పట్టణంలోని రహమత్‌నగర్ కాలనీలో కుక్కకాటుకు గురైన బాధితులు

క్లుప్తంగా

కాల్వల నిర్మాణానికి సర్వే

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రెవెన్యూ శాఖ సర్వేయర్ లక్ష్మీనారాయణ జనగామ గ్రామంలో కెనాల్ నిర్మాణానికి సర్వే చేపట్టారు. ఇటీవల కలెక్టర్ మను చౌదరి గౌరవెల్లి ప్రాజెక్టును పరిశీలించి డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ కోసం భూ సేకరణ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండ్రోజులుగా ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ కోసం రెవెన్యూ అధికారులు శరవేగంగా సర్వేను చేస్తున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి నీటి పంపిణీ కోసం ప్రధాన కెనాల్ నుంచి ఆయా గ్రామాలకు అందించేందుకు వీలుగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మించాల్సి ఉంది. ప్రధాన కాల్వ, ఆయా గ్రామాలకు వెళ్లే కాల్వలు మొత్తం 278 ఎకరాల వరకు భూ సేకరణ చేపట్టాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ప్రేమించి మోసం చేశాడు

- ప్రియుడి ఇంటి ఎదుట బాధితురాలి ధర్నా



ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

సిద్దిపేటజోన్: ప్రేమించి మోసం చేసిన ప్రియుడి ఇంటి ఎదుట బిడ్డతో బాధితురాలు ధర్నా చేపట్టిన ఘటన సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డు(ఇమాంబాద్)లో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు స్వాతి, ఆమె కుటుంబీకులు, మహిళ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రియుడు ఇంటి ఎదుట ధర్నా చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. అంబిగల్ల స్వాతి అదే గ్రామానికి చెందిన గొడుగు గణేశ్‌తో ప్రేమలో పడింది. మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో స్వాతి ఒక ఆడపిల్లకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు గణేశ్‌ను నిలదీయడంతో తనకు సంబంధం లేదని, పెళ్లికి విముఖత చూపడంతో స్వాతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఒక దశలో పుట్టిన ఆడపిల్లకు సంబంధించిన డీఎన్‌ఏ టెస్ట్ ఫలితాల్లో గణేశ్ తండ్రిగా తేలింది. అయినప్పటికీ గణేశ్ వివాహం చేసుకోకుండా ఇబ్బంది పెట్టడంతో తనకు, బిడ్డకు న్యాయం చేయాలని ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితి చేజారకుండా బందోబస్తు నిర్వహించారు. ఒక దశలో బాధితురాలికి నచ్చజెప్పడంతో ధర్నా విరమించింది.

న్యూట్రిషన్ క్లబ్ వేధింపులపై ఆందోళన

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

సిద్దిపేటజోన్: బరువు తక్కువ చేస్తామని నమ్మించి, సభ్యులుగా చేరిన తర్వాత చైన్ సిస్టమ్ పేరిట డబ్బుల కోసం వేధించారని ఆరోపిస్తూ గురువారం పలువురు జిల్లా కేంద్రంలో ఓ హెర్బల్ న్యూట్రిషన్ క్లబ్ వద్ద ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన స్వప్న, రాజిరెడ్డి దంపతులు. గతేడాది స్థానిక రైతు బజార్ వద్ద ఉన్న ఓ న్యూట్రిషన్ సెంటర్ నిర్వాహకులు స్వప్నను కలిసి బరువును తగ్గించే న్యూట్రిషన్ల గురించి వివరించారు. ఇందులో చేరితే లావు తగ్గడంతో పాటు, ఇతరులను చేర్పితే అదనంగా మార్కులు వస్తాయని, కోచ్ ఉద్యోగం వస్తుందని నమ్మబలికారు. బాధితురాలు స్వప్న అందులో చేరి సుమారు.4 లక్షల కొనుగోలు చేసింది. నెల కిందట నిర్వాహకులు కోచ్ ఉద్యోగానికి సంబంధించి కొన్ని పాయింట్లు తక్కువగా ఉన్నాయని, మరో లక్ష కొనుగోలు చేయాలని సూచించారు. నమ్మిన స్వప్న కొనుగోలు చేసినా హోదా రాలేదు. మళ్లీ నిర్వాహకులు ఆమెను మోటివేట్ చేయడంతో డబ్బులు లేక, నిర్వాహకుల ఒత్తిడి భరించక నిద్ర మాత్రలు మింగి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఇంట్లో స్వప్న సూసైడ్ నోట్‌ను గుర్తించిన భర్త రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో న్యూట్రిషన్ సెంటర్ వద్ద ఆందోళన చేశాడు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు.

పరిశ్రమలొచ్చె.. ఉపాధి తెచ్చె

- మెడికల్ డివైజెస్ పార్కులో భారీగా పరిశ్రమలు
- ఉపాధి పొందుతున్న యువత, ప్రజలు
- గ్రామాలకు పెరుగుతున్న ఇతర రాష్ట్రాలవారు
- అద్దెకు ఇళ్లు కూడా దొరకని పరిస్థితి
- అభివృద్ధి చెందుతున్న చుట్టు పక్కల గ్రామాలు



మహిళలకు కుట్టుమిషన్లను అందిస్తున్న ఓ పరిశ్రమ యాజమాన్యం (ఫైల్)



సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్కు ప్రధాన ద్వారం

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో ఉపాధి ఉరకలేస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ డివైజెస్ పార్కులో 30 వరకు వివిధ రకాల పరిశ్రమలను నెలకొల్పారు. దీంతో గ్రామీణ ప్రజలు, యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మెడికల్ డివైజెస్ పార్కులో పని కోసం ఇతర రాష్ట్రాల ప్రజలు, యువత వస్తున్నారు. దీంతో చుట్టు పక్కల అద్దెకు కిరాయి ఇళ్లు కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

మెడికల్ డివైజెస్ పార్కులోని పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు జిన్నారం మండలంలోని మాదారం, జిన్నారం, పెద్దమ్మగూడెం, నల్తూర్, కొర్లకుంట, మంత్రికుంట గ్రామాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు వెళ్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 5 వేల మంది వరకు యువత, మహిళలు ఉపాధిని పొందుతున్నారు. గ్రామాల నుంచి గుంపులుగా మహిళలు ఆటోల్లో వస్తున్నారు. ఇతర రాష్ట్రాలైన బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రజలు కూడా పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు ముందుకొస్తున్నారు.

మాదారం గ్రామం అభివృద్ధి..

డివైజెస్ పార్కు నుంచి మాదారం, మంత్రికుంట, కొర్లకుంట గ్రామాలు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతోపాటు ఇక్కడ ఇంటి కిరాయిలు తక్కువగా ఉండటం, తాగునీటి ఇబ్బందులు లేకపోవడంతో ఈ గ్రామాల్లో నివాసం ఉండేందుకు ఇతర రాష్ట్రాల ప్రజలు ఉత్సాహాన్ని చూపుతున్నారు. దీంతో మాదారం గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి భూముల విలువలు కూడా భారీగా పెరిగాయి. ఎకరం రూ.10 కోట్ల వరకు ఉందంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో తెలుసుకోవచ్చు.

పరిశ్రమల సహకారం

మెడికల్ డివైజెస్ పార్కులో ఏర్పాటు చేసిన పరిశ్రమల యాజమాన్యాలు గ్రామీణ ప్రాంతాల్లో సీఎస్ఆర్ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మాదారంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌ను నేర్పించి తగిన ఉపాధిని అందించేందుకు ఓ పరిశ్రమ ముందుకొచ్చింది. జూట్ బ్యాగులను తయారు చేసేందుకు శిక్షణ ఇవ్వడానికి మరో పరిశ్రమ ముందుకు వచ్చింది. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేలా ఓ పరిశ్రమ యాజమాన్యం ఆరు బోర్లను కూడా వేయించింది. యాజమాన్యాలు పరిశ్రమల ఏర్పాటుతోపాటు ఉపాధి కల్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



గ్రామ సమీపంలో పరిశ్రమలు ఉండటం వల్ల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి లభిస్తోంది. తమ గ్రామంలో నివాసం ఉంటున్న ప్రతీ ఒక్కరికి ఇబ్బందులు లేకుండా చూస్తాం. పరిశ్రమల సహకారంతో గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సురేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ మాదారం

ఉపాధి దొరికింది



సుల్తాన్‌పూర్‌లోని డివైజెస్ పార్కులో ఓ పరిశ్రమలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఉపాధి లభించింది. మాదారంలో అద్దెకు ఉంటున్నా. ఇక్కడ ప్రతీ ఒక్కరి సహకారం లభిస్తుంది. సంతోషంగా విధులు నిర్వహిస్తున్నా.

– బుద్దాదెబ్ రాయ్, ఉత్తరప్రదేశ్, ఉద్యోగి

మరిన్ని ఏర్పాటు చేయాలి



మా గ్రామ సమీపంలో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. గతంలో పని కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డా. ప్రస్తుతం డివైజెస్ పార్కులోని ఓ పరిశ్రమలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తెనుగు శేఖర్, మాదారం

హైనా దాడిలో 18 గొర్రెలు మృతి



మృత్యువాత పడిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల కొమురెల్లి రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద ఉన్న దొడ్డిలో గొర్రెలను పంపి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున దొడ్డి వద్దకు వెళ్లి చూడగా 18 గొర్రెలు మృతి చెందగా, మరో 6 గొర్రెలు తీవ్ర గాయాలతో కనిపించాయి. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాస్, ఫారెస్టు ఆఫీసర్ రాయుడు, వెటర్నరీ అధికారులు గ్రామానికి చేరుకొని గొర్రెలపై దాడి చేసింది హైనా అని నిర్ధారించారు. మృతి చెందిన గొర్రెలకు పంచానా నిర్వహించారు. అలాగే, ముందు రోజు రాత్రి గ్రామానికి చెందిన కర్రె నర్సయ్య దూడే హైనా దాడిలో మృతి చెందింది. కాపరులను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరుల రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి



ఇబ్రహీంనగర్‌లో దెబ్బతిన్న మిర్చి పంట పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

- రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరారెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, మిర్చి పంటలను పరిశీలించారు. వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల మూలంగా పంటలకు నష్టం వాటిల్లి తీరని నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు సంజీవులు, సంపత్, శ్రీనివాస్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- తలపై, ఒంటిపై తీవ్ర గాయాలు
- టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామంలో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్



సంగమ్మ (ఫైల్)

టేక్మాల్(మెదక్): మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన టేక్మాల్ మండలంలోని తంప్లూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బగల్ల సంగమ్మ(44) వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈమె భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందగా, కుమారుడు నాగరాజు హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న సంగమ్మ రోజుమాదిరి గానే తిని నిద్రించగా ఉదయం 9 కావస్తున్నా తలుపులు తీయలేదు. ఇంటికి రెండు డోర్లు ఉండగా ఒకటి లోపల గడియపెట్టి ఉంది. మరోటి ఇంటికి బయట నుంచి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారు తాళం పగులగొట్టి చూడగా రక్తపు మడుగులో సంగమ్మ మృతి చెంది కనిపించింది. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, టేక్మాల్ ఎస్‌ఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకొని, క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ ద్వారా విచారణ చేపట్టారు. గుర్తు తెలియని దుండగులు బలమైన ఆయుధంతో తలపై, చేతులపై దాడి చేసి హత్య చేసినట్లు గుర్తించారు. మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరణ



కుమార్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నవత గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరిగే కుమార్(42)కుమార్ తల్లి పోచమ్మతో కలిసి గ్రామంలోని ఓ పూరి గుడిసెలో ఉంటూ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడి భార్య భూలక్ష్మి, కుమారుడు, కూతురితో కలిసి సుమారు 10 ఏళ్లగా జిన్నారం మండలంలోనే ఉంటుంది. అయితే, మంగళవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో కుమార్ తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. అదే రోజు రాత్రి గ్రామానికి చెందిన గాండ్ల రమేశ్ మూత్ర విసర్జనకు వెళ్లగా ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న ఓ పాడుబడిన గుడిసెలో సెల్ ఫోన్ రింగ్ అవుతుంది. గమనించిన రమేశ్ వెళ్లి చూడగా కుమార్ పడిపోయి కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహం బోర్లా పడి ఉండడం, మృతుడి ఒంటిపై ప్యాంటు లేకపోవడంతో గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తూ డాగ్ స్క్వాడ్ రప్పించాలంటూ పోలీసులతో పట్టుబట్టారు. దీంతో గురువారం ఉదయం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రప్పించగా పోలీస్ జాగిలం గ్రామంలోని బుడగజంగాల కాలనీ వద్దకు వెళ్లి ఆగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

- భర్త ఆత్మహత్య

సిద్దిపేటకమాన్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ ఎస్‌ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన రెడ్డబోయిన నరేశ్ (37)కు సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీకి చెందిన భాగ్యతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. 18వ తేదీన నరేశ్ భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో కాళ్లకుంట కాలనీలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి రత్నవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూములు చూసేందుకు వెళ్తుండగా..

- ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



నుజ్జు నుజ్జయిన కారు



కారులో గిరి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే గిరి(50), దత్తాత్రేయ, సుధాకర్, శ్యాంసుందర్ గౌడ్ లు కారులో గురువారం సదాశివపేటకు భూములు చూసేందుకు వెళ్తున్నారు. గిరి డ్రైవింగ్ చేస్తుండగా మిగితా ముగ్గురు కూర్చున్నారు. పటాన్‌చెరు మండలం పాటి గ్రామ సమీపంలో ఓఆర్ఆర్ పై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా కారుతో ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న గిరి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గిరి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



ఆంజనేయులు మృతదేహం

రాయపోలు(దుబ్బాక): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం అనాజీపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజీపూర్‌కు చెందిన మంగలి ఆంజనేయులు (55) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై రోజూ తాగుతుండేవాడు. ఇటీవల కుటుంబంలో గొడవలు జరిగాయి. ఈ నెల 20 కుటుంబ సభ్యులందరూ బంధువుల పెళ్లి నిమిత్తం పెద్ద మల్లారెడ్డికి వెళ్లి రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటికి రాగా ఆంజనేయులు కనిపించలేదు. రాత్రంతా వెతికినా దొరకలేదు. గురువారం ఉదయం వారి వ్యవసాయం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు.

మద్యం మత్తులో స్నానానికి వెళ్లి..

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్) : చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మధు వివరాల ప్రకారం.. మండలంలోని తున్కిబొల్లారం గ్రామానికి చెందిన పర్వతం స్వామి(35) చిత్తు కాగితాలు ఏరుకొని వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తుంటాడు. రోజు మాదిరిగానే బుధవారం మద్యం తాగి సాయంత్రం 4 గంటలకు ఇంటికొచ్చాడు. గంట తర్వాత బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో గల సాయి చెరువులోకి స్నానానికి వెళ్లి తాగిన మైకంలో నీట మునిగాడు. చుట్టు పక్కల వాళ్లు గమనించి ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో భార్య కొండవ్వకు చెప్పారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులతో చెరువు వద్దకు వెళ్లి ఆచూకీ కోసం గాలించగా దొరకలేదు. గురువారం ఉదయం మృతదేహం చెరువులో తేలయడంతో బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

కందిరీగల దాడిలో 20 మంది గాయాలు

హత్నూర (సంగారెడ్డి): కందిరీగల దాడిలో 20 మందికి గాయాలైన ఘటన హత్నూర మండలం బ్రాహ్మణగూడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలోని వడ్డే యాదగిరి ఇంటి వద్ద ఉన్న చింత చెట్టుకు పెద్ద కందిరీగలు ఉండడంతో చూసుకోకుండా కింద మంట పెట్టారు. ఒక్కసారిగా కందిరీగలు లేచాయి. ఒకే కుటుంబానికి చెందిన దివ్యాంగుడైన మల్లేశం, తండ్రి పోచయ్య, తల్లి దుర్గమ్మకు, తాజా మాజీ ఉపసర్పంచ్ జాంగిర్ భాష, చాకలి నర్సమ్మతోపాటు పలువురికి తీవ్ర గాయాలు అయ్యారు.

విష గుళికలు తాగి పాడి గేదెలు మృతి

- రూ.2 లక్షల వరకు నష్టం



గేదెల వద్ద రోదిస్తున్న బాధిత రైతు

అక్కన్నపేట(హుస్నాబాద్): విష గుళికలు తాగి పాడి గేదెలు మృత్యువాత పడిన ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మట్టెల కనకయ్య అనే రైతు కుటుంబం పాల ఉత్పత్తితో జీవనం సాగిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే తన కున్న వ్యవసాయ క్షేత్రంలో ఉదయం పాలు పితికి గేదెలను కట్టేశారు. వాటి కోసం పాకలో కుడితి పెట్టి ఊరికి వెళ్లాడు. సాయంత్రం సదరు రైతు తండ్రి పోచయ్య పొలం వద్దకు వెళ్లగా కుడితి తాగిన గేదెలు రక్తం కక్కుకుంటూ కొట్టుకోవడం కనిపించాయి. వెంటనే కుమారుడు కనకయ్యకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించాడు. అతడు వచ్చేసరికి రెండు గేదెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారుగా రూ.2లక్షల వరకు ఉంటుందని, ఈ ఘటనపై బాధిత రైతు కనకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- పంట రక్షణకు పెట్టిన కరెంట్ తీగలు తగిలి ఘటన



రాంసింగ్ మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన గురువారం కల్హేర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పోమ్యానాయక్ తండాకు చెందిన తారవత్ రాంసింగ్(42) తండా సమీపంలోని కస్ప పెంటయ్యకు చెందిన వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని జొన్న పంట వేశాడు. జొన్న పంట కాపలా కోసం ఉదయం ఇంటి వెళ్తున్నాడు. మార్గమధ్యలో శ్రావణ్ అనే మరో రైతు పందుల బెడద నుంచి జొన్న పంట కాపాడేందుకు చుట్టూ కరెంట్ తీగలు పెట్టాడు. అక్కడి నుంచి తారవత్ రాంసింగ్ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు శ్రావణ్ నిర్లక్ష్యంగా జొన్న పంట చుట్టూ ఎలాంటి హెచ్చరిక లేకుండా కరెంట్ తీగలు పెట్టడంతో షాక్‌తో రాంసింగ్ మృతి చెందాడని కుటుంబీకులు ఆరోపించారు. బంధువులు, కుటుంబీకులు శ్రావణ్‌ను పట్టుకొని దేహశుద్ధి చేశారు. రాంసింగ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండు చేశారు. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆశ చూపి.. బంగారం అపహరించి

- మహిళకు మాయ మాటలు చెప్పిన కి'లేడీ'
- కారు ఇప్పిస్తానంటే నమ్మి యాదగిరిగుట్టకు వెళ్లిన బాధితురాలు
- నిద్ర మత్తులో ఉండగా పుస్తెలతాడు చోరీ



సీసీ ఫుటేజీలో మాధవి దృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ మహిళకు ఆశ చూపి మరో మహిళ బంగారం, నగదు అపహరించిన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు అంబేడ్కర్ కాలనీకి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలైన స్వరూపకు తన యజమాని వద్ద పని ఉందని రోజుకి రూ. 5 వేలు ఇస్తారని మాధవి అనే మహిళ పటాన్‌చెరులో పరిచయం చేసుకుంది. తాను కూడా పటాన్‌చెరులో ఉంటానని నమ్మబలికింది. తనకు తెలిసిన వారి వద్ద కారు ఉందని రూ.30 వేలకే ఇస్తారని డబ్బులు తీసుకురమ్మని చెప్పింది. బుధ వారం మాధవి స్వరూపను తీసుకెళ్లడానికి వచ్చింది. వీరితోపాటు నిర్మల అనే మరో మహిళను కూడా తీసుకొని యాదగిరిగుట్టకు వెళ్లారు. అక్కడే స్వరూప దగ్గర కారు గురించి దాదాపు రూ. 40 వేలు మాధవి తీసుకుంది. అనంతరం ముగ్గురు మద్యం సేవించారు. వీరికి మత్తు రావడంతో నిర్మల, స్వరూప అక్కడే నిద్రపోయారు. నిర్మలకు మెలకువ వచ్చాక మాధవి మాయమాటలు చెప్పి గుట్ట కిందకు పంపించింది. స్వరూపను కూడా తీసుకొస్తానని వెళ్లిన మాధవి ఆమె మెడలోని బంగారు మంగళ సూత్రాలు తీసుకొని వెళ్లింది. నిద్ర లేచిన స్వరూప ఎవరూ అక్కడ లేకపోవడంతో మాధవి మోసిందని గుర్తించి ఇంటికొచ్చేసింది. ఘటనను స్థానికులకు చెప్పడంతో వారి సాయంతో అంబేడ్కర్ కాలనీలోని సీసీ ఫుటేజీలో మాధవిని గుర్తించారు. ఈ విషయంపై పటాన్‌చెరు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

లీగల్ & డిటెక్టివ్ (ప్రై): సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, ప్రాపర్టీ, డివోర్స్, హై కోర్ట్, సుప్రీమ్ కోర్ట్ పెండింగ్ కేసులు Fast సెటిల్‌మెంట్ మరియు వెరిఫికేషన్ కొరకు అడ్వకేట్ AS రెడ్డి: 9676094111. [H-604912]

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233893]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.